క్లుప్తంగా

రోగులకు ప్రత్యేక వైద్యశిబిరం


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కొండాపురం : కొండాపురం సచివాలయం –2లో ఫామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ ప్రోగ్రాంలో రోగులకు ప్రత్యేకంగా వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు కొండాపురం డాక్టర్ వై.సాంబశివారెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్వల్పకాలిక, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశామన్నారు. దీర్ఘకాలిక రోగులకు తగు సూచనలు, సలహాలు వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ ఎస్.కళావతి, ఎంపీహెచ్ఓ ధనలక్ష్మి, సిహెచ్ఓ శ్రావణి, 104 వాహన సిబ్బంది రాజ్‌కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించండి


నల్లపురెడ్డిపల్లెలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె గ్రామంలో రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్తా చెదారాలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీంతో దోమలు వృద్ధి చెంది జ్వరాలు వచ్చే అవకాశం ఉందని గ్రామస్తులు అంటున్నారు. సంబంధిత అధికారులకు అనేక మార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తా చెదారాలను తొలగించాలని కోరుతున్నారు.

గుడిసె దగ్ధం

వేంపల్లె : మండల పరిధిలోని తాళ్లపల్లె గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె కాలిపోయింది. బుధవారం తాళ్లపల్లె గ్రామంలో ఉండే దాసరి వెంకటస్వామి చిన్న గుడిసె షార్ట్ సర్క్యూట్‌తో నిప్పు అంటుకుంది. అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేయడంతో హుటాహుటినా అగ్నిమాపక సిబ్బంది సంజీవరెడ్డి విద్యుత్ వైరును తొలగించి మంటలను అదుపు చేశారు. అయితే పక్కనే ఉన్న గడ్డి వాములకు నిప్పు అంటకుండా రక్షించడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వల్లూరు : మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ అబ్బిరెడ్డి మల్లేశ్వరి అధ్యక్షతన గురువారం ఉదయం 10:30 గంటలకు మండల సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జుబేద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖలపై సమీక్ష జరుగుతుందని తెలిపారు. జడ్పీటీసీ, మండల పరిధిలోని ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు హాజరు కావాలని ఆమె కోరారు. వివిధ శాఖల మండలస్థాయి అధికారులు పూర్తి సమాచార నివేదికతో హాజరు కావాలని ఆమె కోరారు.

వైఎస్సార్ సీపీ నేతకు నివాళి

కమలాపురం : వైఎస్సార్ సీపీ యువ నాయకుడు సుధా శశిధర్‌రెడ్డి (30)కి కన్నీటి వీడ్కోలు పలికారు. బుధవారం మృతుని స్వగ్రామం కమలాపురం మండలం బయనపల్లెకు చేరుకున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జున రెడ్డిలు శశిధర్‌రెడ్డి పార్థీవదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి, డాక్టర్ రమ్యతారెడ్డి, రాష్ట్ర ఉద్యాన శాఖ సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డిలు నివాళులర్పించారు.

సిబ్బంది నిర్లక్ష్యం.. పెన్షనర్లకు శాపం

ముద్దనూరు : స్థానిక సబ్–ట్రెజరీ కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యంతో పెన్షనర్లకు 18వ తేదీ దాటినా పింఛను సొమ్ము అందకపోవడంతో విమర్శలు తలెత్తుతున్నాయి. స్థానిక సబ్‌ట్రెజరీ పరిధిలో ముద్దనూరు, కొండాపురం మండలాలకు చెందిన పదవీ విమరణ చేసిన ఉద్యోగులు, నామినీ పెన్షర్లకు ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ తమ ఖాతాల్లో జమకాలేదని, జిల్లాలోని ఇతర మండలాల్లోని పింఛనుదారులకు పెన్షన్ అందిందని పెన్షనర్లు వాపోతున్నారు. స్థానిక సబ్‌ట్రెజరీలో సిబ్బంది సమన్వయ లోపంతో తమకు పెన్షన్ అందలేదని 20వ తేదీ సమీపిస్తున్నా పింఛను అందకపోవడంతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వృద్ధులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇప్పటికైనా పింఛను జమ చేయాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యేకు సమస్యల వినతి

ఎర్రగుంట్ల : పట్టణంలోని స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ప్రజలు వారి సమస్యలను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డికి విన్నవించారు. వాటిపై ఆయన స్పందిస్తూ అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఆయన తెలిపారు. అనంతరం మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధిపై ఆయన మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎం.సురేంద్రనాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్‌లతో కలసి సమావేశమై చర్చించారు.

సంక్షేమ పథకాలతో ప్రజలు సుభిక్షం

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేంపల్లె : ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని.. వైఎస్ జగనన్న ప్రభుత్వంలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లె మండలం ముతుకూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ముందుగా ఆ గ్రామంలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రతి ఇంటా మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. అనంతరం శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మూడున్నరేళ్ల కాలంలో సంక్షేమం, అభివృద్ధి పథకాలను అందించారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు ఇంటి ముంగిటకే పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గుర్తించిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ఎంపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

సమస్యలు వింటూ.. పరిష్కారం చూపుతా..

ముతుకూరు గ్రామంలో స్థానికులు భూసమస్యలు, పింఛన్లు తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం భూములను రీసర్వే చేయడం ద్వారా ఒకరి భూమి ఇంకొకరికి వచ్చిందని, కొందరు 30సెంట్లు నుంచి 50సెంట్లు వరకు తక్కువ వచ్చిందని.. మా భూమి ఇంకొకరికి వచ్చిందన్నారు. ఈ విషయం విన్న ఎంపీ తక్షణమే ఆర్డీఓకు ఫోన్ చేసి ముతుకూరు గ్రామంలో భూ సమస్యలన్నింటిని గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. వారంలోపు గ్రామంలోని సమస్యలన్నింటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా.. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబుళరెడ్డి, ఎంపీపీ లక్ష్మీగాయత్రి, ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి, డీఈ శ్రీకాంత్, పీఆర్ డీఈ రవిచంద్రారెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి, ఏఓ రాజేంద్రప్రసాద్, హెచ్ఓ రెడ్డయ్య, ఏపీఓ చంద్రశేఖర్, ఏపీఎం బాలస్వామి, ఎంపీటీసీ చంద్రఓబుళరెడ్డి, సర్పంచ్ కుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రగోపాల్, రామ్మోహన్, పెద్దరామిరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ గోవిందరెడ్డి, ఎస్ఐ తిరుపాల్ నాయక్, తదితర మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సాతుపాటి శ్రీనివాసులుకు ఎంపీ నివాళి

పులివెందుల : పులివెందుల శ్రీవెంకటేశ్వర ఎరుకుల సంఘం, వైఎస్సార్‌సీపీ నాయకుడు సాతుపాటి శ్రీనివాసులు మృతదేహానికి బుధవారం ఎంపీతోపాటు వైఎస్సార్‌సీపీ నేతలు నివాళులర్పించారు. సాతుపాటి శ్రీనివాసులు రెండు రోజుల క్రితం ఒంటిమిట్ట దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో కడపలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందిన విషయం తెలిసిందే. పులివెందులలోని శ్రీనివాసులు స్వగృహంలో శ్రీనివాసులు మృతదేహానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్పలతోపాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు నివాళులర్పించారు. అనంతరం అదే రోడ్డు ప్రమాదంలో గాయపడిన శ్రీనివాసులు కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. శ్రీనివాసులు కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో వైద్యానికి పెద్ద పీట

శాప్ రాష్ట్ర డైరెక్టర్ రవీంద్రారెడ్డి


మాట్లాడుతున్న శాప్ రాష్ట్ర డైరెక్టర్ రవీంద్రారెడ్డి

తొండూరు : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో వైద్యానికి పెద్ద పీట వేశారని శాప్ రాష్ట్ర డైరెక్టర్ రవీంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీడీఓ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి సచివాలయ పరిధిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ఏర్పాటు చేసి వైద్యానికి పెద్ద పీట వేశారన్నారు. అలాగే 108, 104లతోపాటు వైఎస్సార్ హెల్త్ కిట్లతోపాటు ప్రతి గ్రామంలో 104 ద్వారా ఎన్నో వైద్య సేవలందిస్తున్నారన్నారు. అలాగే ప్రతినెలా 9వ తేదీన గర్భిణులకు ఆయా పంచాయతీల పరిధిలో ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే పీహెచ్‌సీ డాక్టర్ అరిఫుల్లా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 74 పీహెచ్‌సీలు ఉండగా.. తొండూరు పీహెచ్‌సీ నాల్గవ స్థానంలో.. రాష్ట్రంలో 1142 పీహెచ్‌సీలు ఉండగా.. 179వ స్థానంలో తొండూరు పీహెచ్‌సీ ఉందని.. దీంతో 90 శాతం తొండూరు పీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. అలాగే వంద శాతం వైద్య సేవలు అందించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, స్థానికుల సహాయ సహకారాలతో కృషి చేస్తామన్నారు. ప్రతినెలా 9వ తేదీన గర్భిణులకు వైద్య సేవలు అందించే సమయంలో ఎవరైనా దాతలు ముందుకు వచ్చి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని కోరగా.. సైదాపురం సర్పంచ్ ఆదర్శ ఓబుళరెడ్డి ముందుకు వచ్చి ఈ ఏడాది డిసెంబర్ వరకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తానని తెలిపారు. అలాగే పాడా నిధుల కింద మంజూరైన పనులను ఫిబ్రవరి 15వ తేదీనాటికి పూర్తి చేయాలని పీఆర్ ఇంజనీర్ లక్ష్మినారాయణరెడ్డి కోరారు. లేకపోతే మార్చి చివరి నాటికి వర్క్‌లు తొలగిస్తారని.. ప్రజాప్రతినిధులు ఆయా గ్రామాలలో వేగంగా పనులు పూర్తి చేయాలని కోరారు. మండలంలో 776 జగనన్న ఇళ్లు మంజూరయ్యాయని.. ఇప్పటి వరకు 114 ఇళ్లు పూర్తయ్యాయని హౌసింగ్ ఏఈ వాసుదేవరెడ్డి తెలిపారు. విద్యుత్ ఏఈ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ పూర్తైన జగనన్న పక్కాగృహాలకు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే వ్యవసాయ, ఉపాధి హామీ, వెలుగు, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన వాటిపై సమీక్ష నిర్వహించారు. మండల సమావేశానికి డుమ్మా కొట్టిన అంగన్‌వాడీ, పశు వైద్య శాఖ అధికారులకు నోటీసులు జారీ చేస్తామని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో మండల పరిశీలకుడు బండి రామమునిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ బాలనరసింహులు, ఎంపీటీసీలు ఓబులేసు, విజయ్ శంకర్, ప్రకాష్‌రావు, మాజీ ఎంపీటీసీలు వెంకట్రామిరెడ్డి, శివశంకర్‌రెడ్డి, సర్పంచ్‌లు శశికాంత్‌రెడ్డి, గురుమోహన్‌రెడ్డి, గంగిరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, రామసుబ్బారెడ్డి, గోపాల్, రజియా తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ లబ్ధి

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి


ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చెన్నూరు : అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని ఉప్పరపల్లె గ్రామ పంచాయతీలో నరసారెడ్డిపల్లె, దుగ్గనపల్లె, దుగ్గనపల్లె దళితవాడతోపాటు ఉప్పరపల్లె మెయిన్‌లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయనకు తన తనయుడు, సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డికి ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా వారు గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ఏ కుటుంబానికి ఎంతమేర లబ్ధి చేకూరిందో వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకుని అక్కడే ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవుడి దయతో, మీ అందరి చల్లని దీవెనలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మంచి పరిపాలన అందించడం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ ఎర్రసాని నిరంజన్‌రెడ్డి, వై.రాజగోపాల్‌రెడ్డి, నరసయ్య యాదవ్, గాజులపల్లె సంపూర్ణరెడ్డి, సాయికుమార్‌రెడ్డి, బోగాల కొండారెడ్డి, ఓబుల్‌రెడ్డి, రమణారెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఆర్‌వీఎస్‌ఆర్, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, అటవీశాఖ డైరెక్టర్ రామన శ్రీలక్ష్మి, సర్పంచులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంటును ప్రారంభించిన ఎమ్మెల్యే

మండలంలోని ఉప్పరపల్లె గ్రామ పంచాయతీలోని నరసారెడ్డిపల్లె గ్రామంలో ఆర్వోప్లాంటును ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ఖనిజ అభివృద్ధి సంస్థ ఆర్థిక సాయంతో కమలాపురం నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపుగా 25 ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశామన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

చింతకొమ్మదిన్నె : మండలంలోని పాపాసాహెబ్‌పేట గ్రామ సచివాలయ పరిధిలోని బాలుపల్లె గ్రామంలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డిలు పాల్గొంటారని మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్ని జయప్రదం చేయాలన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కమలాపురం : ప్రస్తుత తరుణంలో సైబర్ నేరాలు పెరిగి పోతున్నాయని, ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కళాజాత సభ్యులు తెలిపారు. జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు, సీఐ సత్యబాబు ఆధ్వర్యంలో ఎస్ఐ చిన్నపెద్దయ్య పర్యవేక్షణలో బుధవారం రాత్రి మండలంలోని పెద్దచెప్పలిలో సైబర్ నేరాలు, ఫ్యాక్షన్ పై కళాజాత సభ్యులు నాటిక రూపంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఎవరైనా ఫోన్ చేసి మీ బ్యాంక్, ఇతర వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు. గ్రామంలోని పెద్ద మనుషుల వద్ద గాని, లేదా పోలీస్, కోర్టు ద్వారా గాని సమస్యలు పరిష్కరించు కోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

పెద్దముడియం : మేడిదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జమ్మలమడుగు ఉప ఆరోగ్య వైద్య శాఖాధికారిణి డాక్టర్ శాంతకళ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డ్స్, ఆసుపత్రి వార్డులు, మరియు కాంపౌండ్ పరిసరాలు పరిశీలించి పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ హుస్సేన్‌కు పలు సూచనలు చేశారు. పీహెచ్‌సీ నందు కాన్పులు తప్పకుండా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. సిబ్బంది సమయానికి విధులకు హాజరై ఎఫ్.ఆర్.ఎస్ యాప్ ద్వారా హాజరు నమోదు చేయాలని ఆదేశించారు.

ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

జమ్మలమడుగు : పట్టణంలోని స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఎన్టీఆర్ 27వ వర్ధంతిని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుబ్బిరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించి ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతపురం ఎమ్మెల్సీ శివనాథ్‌రెడ్డి, పలువురు పాల్గొన్నారు.

తలనీలాలు, టెంకాయల విక్రయాలకు వేలంపాట

సింహాద్రిపురం : మండలంలోని రావులకొలను పంచాయతీ పరిధిలోని భానుకోట శైవక్షేత్ర ఆలయానికి సంబంధించి తలనీలాలు, టెంకాయల విక్రయాలకు ఆలయ ఇన్‌స్పెక్టర్ నరసింహ సింగ్, ఆలయ ఈఓ విశ్వనాథరెడ్డి, సర్పంచ్ మహేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. మెదుకూరుకు చెందిన బాలస్వామి రూ.5 లక్షలకు తలనీలాలను దక్కించుకోగా.. సింహాద్రిపురంకు చెందిన రాజగోపాల్‌రెడ్డి రూ.3.11 లక్షలకు టెంకాయల విక్రయాలను దక్కించుకున్నారు. పంచాయతీ కార్యదర్శి వెంకటసుబ్బారెడ్డి, ప్రజలు పాల్గొన్నారు

ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు


సంక్షేమపథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు రూరల్ : అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమపథకాలు అందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. మండల పరిధి గుడెంచెరువు గ్రామంలో ఉన్న రాజీవ్‌నగర్ కాలనీలో బుధవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలనుంచి పలు సమస్యలను తెలుసుకున్నారు. తమకాలనీలో రోడ్లు, కాలువలు విద్యుత్ వీధి దీపాలు లేవని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన త్వరలోనే మీ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2007–08 సంవత్సరంలో రాజీవ్‌నగర్‌లో ఇళ్లులేని నిరుపేదలను గుర్తించి మహనేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దాదాపు 1500 వందల ఇళ్లను వారికి అందించడం జరిగిందన్నారు. అయితే ఆయన మరణానంతరం వచ్చిన పాలకులు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందన్నారు. నిధులు మంజూరైన వెంటనే కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. భవిష్యత్‌లో తమ కుటుంబాలు అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగనన్నకు తమ దీవెనలు అందించాలన్నారు. ఇళ్లులేని వారు, పింఛన్లు రాని వారు ఉంటే ఆన్‌లైన్ చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ లక్ష్మిదేవి, సర్పంచ్ మజ్జారి నాగేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు సంజీవరాయుడు, నాగేశ్వరరెడ్డి, శివారెడ్డి, కట్టశ్రీను, రాష్ట్ర చేనేత సంఘం నాయకుడు బడిగింజల చంద్రమౌలి, సచివాలయసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'నేడు గడప గడపకు మన ప్రభుత్వం'

మైలవరం (జమ్మలమడుగురూరల్) : మైలవరం మండలం దొమ్మరనంద్యాల గ్రామంలో గురువారం ఉదయం ఆరుగంటలకు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలనుంచి ప్రారంభమయ్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధన్నవాడ మహేశ్వరరెడ్డి తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

భూములు కోల్పోతున్నాం.. న్యాయం చేయండి

బాధిత రైతులు తహసీల్దార్‌కు వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధిత రైతులు

కమలాపురం : కమలాపురం పాపాఘ్ని నదిపై నూతనంగా నిర్మిస్తున్న వంతెన నిర్మాణంలో తాము భూములు కోల్పోతున్నామని, తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు జయమ్మ, హేమలత, దినకరుడు, లూకయ్య, రవికుమార్, కులాయప్ప, రత్నమ్మ తదితరులు కోరారు. బుధవారం వారు తహసీల్దార్ అమరేశ్వరికి వినతిపత్రం అందజేశారు. తాము పేద ఎస్సీ రైతులమని, తమకు జడ్‌హెచ్‌డీసీ 1972లో ఈ భూములను పంపిణీ చేశారని, అప్పటి నుంచి తాము ఈ భూముల్లో పంటలు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నామని వారు తెలిపారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న పాపాఘ్ని నదిపై వంతెన నిర్మాణం తమ భూముల్లో జరుగుతోందన్నారు. నేషనల్ హైవే అధికారులు తమకు కనీసం సమాచారం కూడా ఇవ్వకుండానే పంటలు సాగు చేసిన పొలాల్లోనే నిర్మాణం ప్రారంభించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తమ సమస్యను పరిష్కరించాలని బాధిత రైతులు తహసీల్దార్‌ను వేడుకున్నారు.

వేంపల్లె టీడీపీ నాయకులలో అంతర్గత పోరు

వేంపల్లె : వేంపల్లె టీడీపీలో కొన్ని మాసాల నుంచి జరుగుతున్న అంతర్గత పోరు బయట పడింది. బుధవారం ఎన్‌టీఆర్ వర్ధంతి రోజున టీడీపీలో చీలికలు ఉన్నట్లు తేలిపోయింది. వేంపల్లెలో రెండు టీడీపీ కార్యాలయాలు ఉండగా.. వాటిలో సతీష్‌రెడ్డికి చెందిన వర్గం ఒకటి, మరోపక్క బీటెక్ రవికి చెందిన కార్యాలయం ఒకటి ఉన్నాయి. ప్రతి కార్యక్రమం బీటెక్ రవికి చెందిన పార్టీ కార్యాలయంలో చేయాలని కొందరు నాయకులు చెబుతున్నా.. మరో వర్గం మాత్రం వాటిని లెక్కలోకి తీసుకోవడంలేదు. బుధవారం టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్‌టీఆర్ వర్ధంతిని సతీష్‌రెడ్డి వర్గంకు చెందిన ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ కార్యాలయంలో చేయడం జరిగింది. దీంతో బీటెక్ రవికి చెందిన కార్యాలయంలో ఎన్‌టీఆర్ వర్ధంతి వేడుకలు జరగలేదు. వేంపల్లె టీడీపీలో గందరగోళంగా మారడంతో కార్యకర్తలు అయోమయంలో పడ్డారు. ఈ వేడుకలు వారి బల నిరూపణగా మారిపోయిందని పలువురు చర్చించుకుంటున్నారు. సతీష్‌రెడ్డి వర్గీయులు జరిపిన వేడుకలకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారథిరెడ్డి, తెలుగు రైతు జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జగన్నాథరెడ్డి, మాజీ మండల కన్వీనర్ వెంకటసుబ్బారెడ్డి, మాజీ దేవస్థాన చైర్మన్లు ఎద్దుల కొండయ్య, రాజారావులతోపాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. రెండు వర్గాలు ఉండటంతో టీడీపీ మండలంలో బలహీనపడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైకి మాత్రం అందరూ కలిసికట్టుగా ఉన్నట్లు నటన చేస్తూ కార్యక్రమాలు మాత్రం వేర్వేరుగా చేస్తున్నారు. టీడీపీ వర్గ పోరు రోజు రోజుకు పెరిగిపోతోందనడానికి ఎన్‌టీఆర్ వర్ధంతి వేడుకలే నిదర్శనం.

ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి


ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డిని సత్కరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు

పులివెందుల రూరల్ : మార్చిలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న రామచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కృష్ణ, గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, వైఎస్సార్‌టీఎఫ్ గౌరవ అధ్యక్షురాలు కల్పలతారెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిలు తెలిపారు. బుధవారం స్థానిక శ్రీమిట్టమల్లేశ్వరస్వామి కల్యాణ మండపంలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామచంద్రారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రవీంద్రారెడ్డిలకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర నాయకుడు వెంకటనాథరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మొదటి మహిళగా ఎన్నికైన కల్పలతారెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించండి


మాట్లాడుతున్న ఎంవీఐ ప్రసాద్

పులివెందుల రూరల్ : వాహనదారులు ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని ఎంవీఐ ప్రసాద్ సూచించారు. రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా బుధవారం పట్టణంలోని శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో ఆయన విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించి మాట్లాడారు. రహదారులు నిత్యం రక్తసిక్తమవుతూనే ఉన్నాయని వాహనాలలో వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించకపోవడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, కార్లలో సీటు బెల్టు పెట్టుకోకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రహదారి ప్రమాదాలు నివారించడానికి ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పులివెందుల రూరల్ : ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని పులివెందుల ట్రాఫిక్ సీఐ వెంకటేశులు సూచించారు. బుధవారం పట్టణంలోని పలు చోట్ల ఆయన తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టి ట్రాఫిక్‌కు అడ్డుగా పెట్టిన పలు వాహనాలకు జరిమానాలు విధించారు. వాహనదారులు తప్పనిసరిగా వాహన పత్రాలు మీ దగ్గరే ఉంచుకోవాలని తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జరిమానాల రూపంలో రూ.4025లు వచ్చిందన్నారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ కేంద్రాలు

వల్లూరు : మండలంలో గురువారం నుంచి మొబైల్ ఆధార్ కేంద్రాల ద్వారా సేవలను అందించడం జరుగుతుందని ఎంపీడీఓ జుబేద ఒక ప్రకటనలో తెలిపారు. 19, 21 తేదీలలో వల్లూరు గ్రామ సచివాలయంలో, 20న వల్లూరు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో, 23 మరియు 24 తేదీలలో గంగాయపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసి సేవలందించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో 5 నుంచి 15 సంవత్సరాల వారికి ఆధార్ కార్డులు జారీ చేయుట, ఆధార్ కార్డు నందు చిరునామా, ఫొటో మార్పు చేయుట, ఆధార్ కార్డును ఫోన్ నంబర్‌కు లింక్ చేయుట, వేలిముద్రలు అప్‌లోడ్ చేయడం, డాక్యుమెంట్‌లను అప్‌లోడ్ చేయడం వంటి సేవలు అందుబాటులో వుంటాయని తెలిపారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

అంబకపల్లెలో సీసీ రోడ్ల నిర్మాణానికి సర్వే


అంబకపల్లెలో పర్యటిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ విజయభాస్కర్, తదితరులు

లింగాల : మండలంలోని అంబకపల్లె గ్రామంలో బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయభాస్కర్, వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు ఇన్‌చార్జి రవికుమార్‌లు పర్యటించారు. గ్రామంలో రూ.2.40 కోట్ల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలోని రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని.. తిరిగి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణాలు అంచనాలు వేసేందుకు సర్వే నిర్వహించారు. గ్రామంలో సుమారు 3.71కి.మీ మేర సీసీ రోడ్లు ఏర్పాటు చేయాల్సి ఉందని ఈఈ తెలిపారు. ఇందుకు సంబంధించి నిధులు అంచనాలు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాంగోపాల్‌రెడ్డి, ఏఈ బాబా, పీఆర్ ఏఈ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బాబురెడ్డి, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

చెన్నూరు : మండల పరిధి రామనపల్లి గ్రామంలోని దళితవాడలో తలమల నరసమ్మ బుధవారం మృతి చెందడంతో ఆమె అంత్యక్రియల కోసం అంబేడ్కర్ సేవా సంఘం తరుపున రూ.2 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గురవయ్య, తదితరులు పాల్గొన్నారు